ప్రజాశక్తి
బుధవారం 16 నవంబర్ 2022



విజయనగరం రెవెన్యూ డివిజన్ పరిధిలోకి నెల్లిమర్ల

అభ్యంతరాలు, సూచనల స్వీకరణకు నెల రోజుల గడువు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న నెల్లిమర్ల మండలాన్ని విజయనగరం రెవెన్యూ డివిజన్ పరిధిలో కలిపేందుకు ప్రాథమిక నోటిఫికేషన్‌ను కలెక్టర్ ఎ. సూర్యకుమారి జారీ చేశారు. ప్రభావిత వ్యక్తులు అభ్యంతరాలు, సూచనలను నెల రోజుల్లోగా కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌లో పేర్కొన్న మేరకు సంబంధిత ప్రతిపాదనలు ఉన్న నోటీసులను చీపురుపల్లి, విజయనగరం ఆర్‌డిఒలకు, నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్, ఎంపిడిఒలకు కలెక్టర్ జారీ చేశారు. నవంబర్ 10నుంచి నెల రోజుల గడువు వర్తిస్తుందని స్పష్టం చేశారు. జిల్లాల పునర్విభజన ప్రక్రియలో భాగంగా నెల్లిమర్ల మండలం చీపురుపల్లి రెవెన్యూ పరిధిలోకి వెళ్లిపోయిన విషయం అందరికీ విధితమే.



ఏదైనా ఒక పని చేయాలంటే ప్రణాళిక ఉండాలి. ప్రభుత్వ అనుమతులు అంతకన్నా ముఖ్యం. ప్రజామోదం తప్పనిసరి. ఆపై ప్రజలకు ఎంతో ప్రయోజనమైన పనులైనా నిబంధనలకు లోబడి చేపట్టాలి. కానీ, ఇవేవీ పట్టించుకోకుండానే పనులు చేపట్టడం, ఆపై బిల్లులకు సిద్ధపడడంతో బాగోతం రచ్చకెక్కింది. పూసపాటిరేగ మండలంలో చోటు చేసుకున్న ఈ పరిణామం హాట్‌టాపిక్‌గా మారింది. కలెక్టర్ ఆదేశంతో డిఆర్‌డిఎ పీడీ కొద్దినెలల క్రితం విచారణ చేపట్టారు. చాలా పనులు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టినట్టు ఆయన తన నివేదికలో పేర్కొన్నారు. ఇదే మండలంలో చేపట్టిన మెటీరియల్ కాంపొనెంట్ పనులపై వచ్చిన అభియోగాలపై విచారణ చేపట్టేందుకు రాష్ట్ర కేంద్రం నుంచి త్రిసభ్య కమిటీ బుధవారం రానుంది. దీంతో, పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. ఇంతకీ ఏం జరిగిందంటే...

అంచనాలు లేకుండా..ఆమోదం పొందకుండా...

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/పూసపాటిరేగ

కొద్ది నెలల క్రితం కుమిలిలో శ్మశానవాటిక నిర్మాణం జరకుండానే రూ.6.50లక్షలు దుర్వినియోగం జరిగిందని ఆరోపణలు వచ్చాయి. దీంతో, కలెక్టర్ సూర్యకుమారి అప్పటి వరకు పూసపాటిరేగ మండల స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న డ్వామా పీడీని తప్పించారు. ఆ స్థానంలో డిఆర్‌డిఎ పీడీ కల్యాణ్ చక్రవర్తిని నియమించారు. మెటీరియల్ కాంపొనెంట్ నిధుల వినియోగంలో అక్రమాలు జరిగినట్టు అభియోగాలు ఎక్కువ కావడంతో అదే మండలంలోని మరికొన్ని గ్రామాల్లో జరిగిన పనులపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని ఆదేశించారు. దీంతో, రంగంలోకి దిగిన చక్రవర్తి మొత్తం 9గ్రామాల్లో జరిగిన పనులపై క్షేత్ర స్థాయి విచారణ చేపట్టారు. ఇందులో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆయన నివేదిక ప్రకారం... కుమిలి నుంచి నాగంపేట ఆర్‌అండ్‌బి రహదారి వరకు చేపట్టిన రోడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉన్నప్పటికీ పరిపాలనా అనుమతులు తీసుకోలేదు. దీంతో, ఈ పనికి సంధించిన ఫొటోలు అప్‌లోడ్ చేయడం సాధ్యం కాదు. పతివాడ, పశుపాం జిల్లా పరిషత్ స్కూళ్లల్లో భూమిని చదును చేసేందుకు గ్రామ సభ తీర్మానంగానీ, పరిపాలనా అనుమతులుగానీ లేవు. పని మాత్రం పూర్తయ్యింది. కానీ, ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిబంధనలకు విరుద్ధంగా ఈ పనులు జరిగాయి. చౌడువాడ శ్మశానవాటిక, చౌడువాడ గ్రావెల్ రోడు పనులకు సంబంధించి కూడా తీర్మానాలు, అనుమతులు లేవు. మస్తర్లు జారీ చేసినప్పటికీ పనులు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయి. ఏరుకొండలో స్లాబ్ కల్వర్టు, వెంపడాంలో పైపు కల్వర్టులు, తూములు, గ్రావెల్ రోడ్డులు, విలేజ్‌పార్కులు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని ఆ నివేదికలో పేర్కొన్నారు. మండలంలోని మరికొన్ని గ్రామాల్లో జరిగిన పనితీరును కూడా చక్రవర్తి తన నివేదికలో పొందుపర్చారు. ఈనేపథ్యంలో వీటిపై మంత్రి బొత్స, జిల్లాలోని కీలక నేతలు సీరియస్‌గా ఆరా తీస్తున్నట్టు చర్చ నడుస్తోంది. ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే విధంగా వ్యహరిస్తే ఊరుకునేది లేదంటూ ఇటీవల అటు మంత్రి, ఇటు జెడ్‌పి ఛైర్మన్ ఎక్కడికక్కడ హెచ్చరిస్తున్న విషయం విధితమే. మరోవైపు ఇక్కడి పరిణామాలపై ఆరా తీసిన పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ ఆరా తీశారు. ముగ్గురు అధికారులతో కూడిన విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీ బుధవారం జిల్లాకు వస్తున్నట్టు సమాచారం. కమిటీ మొత్తం వ్యవహారంపై దృష్టి పెడుతుందా? లేక

ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధుల వినియోగంలో అడగడుగునా అభియోగాలు

డిఆర్‌డిఎ పీడీ విచారణలో వెలుగులోకి

నివ్వెరబోతున్న ప్రజానీకం

నేడు రాష్ట్ర కేంద్రం నుంచి విచారణ కమిటీ రాక

ఒకటిరెండు పనుల పరిశీలనకు పరిమితమౌతుందా? వేచిచూడాల్సిందే. ఏదేమైనా కమిటీ రాకతో అభియోగాల్లో వాస్తవమెంత? వాటిలో అధికారులు, అనధికారుల పాత్ర ఏమేరకు ఉందనేది స్పష్టమౌతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు

- 1,2 తరగతులకు స్మార్ట్ టీవీలు
- ఇంటి నిర్మాణం ప్రారంభించకపోతే రద్దు
- వారంలో రెండుసార్లు పాఠశాలలు సందర్శించాలి
- విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-గరివిడి

వచ్చే విద్యాసంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో 3వ తరగతి నుంచి డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. 1,2 తరగతులకు స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేస్తామన్నారు. వీటి రక్షణ కోసం ప్రతీ పాఠశాలకు ఒక వాచ్‌మెన్‌ను నియమించడమే కాకుండా, సిసి కెమెరాలను కూడా అమర్చనున్నట్లు వెల్లడించారు. ఎంపిపి మీసాల విజయలక్ష్మి అధ్యక్షతన ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాడు-నేడు కార్యక్రమం ద్వారా దశలవారీగా అన్ని పాఠశాలల్లో మౌలిక, అధునాతన సదుపాయాలను కల్పిస్తామని తెలిపారు. సంక్రాంతి పండగ లోగా రాష్ట్రంలోని సుమారు 5 లక్షల మంది 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను అందజేయనున్నట్లు తెలిపారు. సభ్యుల సూచనల మేరకు ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం కోసం ప్రతీ శనివారం ఒక పీరియడ్‌ను కేటాయించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు వారంలో రెండు రోజులు పాఠశాలలను సందర్శించి, మధ్యాహ్న భోజనం, పారిశుధ్యం, తరగతుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించాలని కోరారు. దీనికోసం అన్ని పాఠశాలల్లో త్వరలో విజిటర్స్ బుక్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పారు.


గహ నిర్మాణ శాఖపై సమీక్షిస్తూ, నిర్మాణం ప్రారంభించని ఇళ్లను రద్దు చేయాలని మంత్రి ఆదేశించారు. మండలంలో 176 మంది ఇప్పటికీ ఇళ్ల నిర్మాణం ప్రారంభించలేదని, మరికొంతమంది గోతులు తవ్వేసి వదిలేశారని అధికారులు తెలిపారు. వీరికి నోటీసులు ఇచ్చి, డిసెంబరు 15 వరకు గడువు ఇవ్వాలని, అప్పటికీ నిర్మాణాన్ని ప్రారంభించకపోతే రద్దు చేయాలని ఆదేశించారు. వారి స్థానంలో అర్హత ఉన్నకొత్త వారికి ఇళ్ల మంజూరు చేయాలని సూచించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి, ప్రతిపాదిత పనులన్నిటినీ త్వరలో మంజూరు చేస్తామని చెప్పారు.

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, త్వరలో జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కానుందని, పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. సభ్యుల కోరిక మేరకు మొక్కజొన్న పంటకు కూడా అవసరమైన ఎరువులను వెంటనే సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అందరికీ అందేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్‌డిఒ ఎం.అప్పారావు, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, డిఇఒ కె.వెంకటేశ్వర్రావు, సర్వశిక్ష ఎపిసి డాక్టర్ స్వామినాయుడు, ఎపిఎంఐపి పిడి పిఎన్‌వి లక్ష్మీనారాయణ, పశు సంవర్ధకశాఖాధికారి డాక్టర్ వైవి రమణ, డిపిఒ నిర్మలాదేవి, డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ధన్నాన జనార్ధన్, తాశీల్దార్ తాడ్డి గోవింద, ఎంపిడిఒ గొర్లె భాస్కరరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డిసెంబర్ 30న ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా

ప్రజాశక్తి-విజయనగరం

పట్టభద్రుల నియోజక వర్గం ఓటర్ల తుది జాబితాను డిసెంబర్ 30న ప్రచురించనున్నట్లు కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. నవంబర్ 7 తో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిందని , ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా సుమారు 60 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీటిని పరిశీలించి డూప్లికేషన్, తప్పులున్న దరఖాస్తులను తిరస్కరిస్తామని తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం రాజకీయ పక్షాల ప్రతినిధులతో, ఇఆర్‌లు, ఎఇఆర్‌ఒలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితాను ఈనెల 23న ప్రచురిస్తామన్నారు. జాబితాను ఎన్నికల జిల్లా వెబ్‌సైట్‌లో పెడతామని, 23 నుండి డిసెంబర్ 9 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు ఫైల్ చేస్తామని, 25న క్లెయిమ్‌లు పరిష్కరిస్తామని వివరించారు. పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి ప్రస్తుతం 39 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, స్థానం మార్పు కోసం ఒక కేంద్రాన్ని ప్రతిపాదించినట్లు తెలిపారు. కొత్తగా 25 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించామని తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ గణపతిరావు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


బిర్సాముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విసి కట్టమణి

ఆదర్శ ప్రాయుడు బిర్సా ముండా

సిటియు విసి కట్టిమణి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గిరిజనులు ఆరాధ్యంగా భావించే బిర్సా ముండా భారతీయ అటవీ జాతుల స్వాతంత్ర్య సమరయోధుడు, జానపద నాయకుడని, స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఒక ప్రముఖ వ్యక్తిగా నిలిచిపోయాడని గిరిజన యూనివర్శిటీ విసి ప్రొఫెసర్ కట్టమణి అన్నారు. మంగళవారం బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని సిటియులో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి విసి పూలమాల వేసి నివాళులర్పించారు .అనంతరం ప్రొఫెసర్ కట్టిమని మాట్లాడుతూ బ్రిటిషు వలసవాదంపై తిరుగుబాటుగా సాగిన భారతీయ స్వాత్రంత్ర్య పోరాటంలో పాల్గొన్న యోధునిగా బిర్సా ముండా నిలిచిపోయారని అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిధులుగా ప్రఖ్యాత వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎంవిఎస్ గుప్త, గౌరీ ప్రసాద్ పాల్గొని బిర్సాముండా నిస్వార్ధ సేవలను విద్యార్థులకు వివరించారు.

సీతంపేట : మండల కేంద్రమైన సీతంపేటలో బిర్సా ముండా జయంతి సభ ఎపి గిరిజనసంఘం కార్యాలయంలో జీలకర్ర శ్రీరాములు అధ్యక్షతన జరిగింది. కార్యదర్శి బిడ్డిక అప్పారావు మాట్లాడుతూ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా గిరిజన హక్కుల కోసం ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాడిన ఆదివాసీ ధీరుడు బిర్సా ముండా అని కొనియాడారు. నేడు మోడీ ప్రభుత్వం 2022 అటవీ హక్కుల సంరక్షణ సవరణ బిల్లు తెచ్చి అడవులన్నీ కార్పొరేట్లకు ధారాదత్తం చేయాలని చూస్తుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తు పోరాటాలకు ఆదివాసీలు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు.

జిల్లా ఉద్యోగులకు ఓవరాల్ ఛాంపియన్ షిప్

ప్రజాశక్తి-విజయనగరం

ఇటీవల విజయవాడ లో జరిగిన రెవిన్యూ క్రీడలలో జిల్లా రెవిన్యూ ఉద్యోగులు 30 అంశాలలో ప్రతిభ చూపించి ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించినందుకు కలెక్టర్ సూర్య కుమారి అభినందించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం తహశీల్దార్ల తో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఏయే అంశాలలో ఎవరెవరు గెలుపొందారని అధ్యక్షులు గోవిందను అడిగి తెలుసుకొని పేరు పేరునా అందరిని కలెక్టర్ అభినందించారు. క్రీడలతో పాటు కల్చరల్ విభాగంలో కూడా పలువురు తమ ప్రతిభ చూపారని గోవింద్ తెలిపారు. అందరితో కలసి రెవిన్యూ తరపున ఒక పిక్నిక్ కూడా జరుపుకోవాలని తెలిపారు.

స్వీప్ కార్యక్రమాలు చురుకుగా జరగాలి

అనంతరం కలెక్టర్ తహశీల్దార్లతో మాట్లాడుతూ ఓటరు నమోదుపై 18 ఏళ్లు నిండిన వారికి చైతన్యం కలిగించే స్వీప్ కార్యక్రమాలు ప్రతి మండలంలో జరగాలన్నారు. ధాన్యం సేకరణ పై రెవిన్యూ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకొని రైతులు ఒకే సారి కోతలు చేయకుండా దఫ దఫాలుగా చేసేలా చూడాలన్నారు. స్పందనలో ఎక్కువ దరఖాస్తులు రెవిన్యూ కే వస్తున్నాయని, స్పందన వినతులను పరిష్కరించాలని సూచించారు.

డిసిఎంఎస్ కార్యాలయంలో సహకార వారోత్సవాలు

విజయనగరం టౌన్ : సహకార రంగ సేవలు విస్తృతపర్చడం- సహకార సంస్థలను బలోపేతం చేయడమే అఖిల భారత సహకార వారోత్సవాల ముఖ్యఉద్దేశ్యమని డిసిఎంఎస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన అన్నారు. 69వ అఖిల భారత సహకార వారోత్సవాలను డిసిఎంఎస్ కార్యాలయంలో జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమావేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసిఎంఎస్ ఎల్లవేళలా రైతులకు అండగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అవనాపు విక్రమ్, డిసిఎంఎస్ డైరెక్టర్లు పి.నారాయణ మూర్తి, ఎస్.సన్యాసినాయుడు, బి.బంగారు నాయుడు, జొన్నాడ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సినీనటుడు కృష్ణకు నివాళి

విజయనగరం : సినీనటుడు, సూపర్‌స్టార్ కృష్ణ మృతికి ప్రముఖ రచయిత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ తెలుగు భాషా విశిష్ట సేవా పురస్కార గ్రహీత సముద్రాల గురుప్రసాద్ నివాళులర్పించారు. కృష్ణ కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. దర్శకుడిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా, మాజీ పార్లమెంటుసభ్యులుగా ఆయన ప్రతీ రంగంలోను, ప్రతి విషయంలోనూ స్ఫూర్తి దాయకంగా నిలిచారని అన్నారు. కృష్ణ సినీ జీవిత విశేషాలపై 2013లో తాను రాసిన ' సూపర్ స్టార్ ' అనే పుస్తకాన్ని తన స్వగృహంలో హైదరాబాద్‌లో ఆయన స్వయంగా ఆవిష్కరించారని, ఈ పుస్తకాన్ని హైదరాబాద్‌కు చెందిన కిన్నెర పబ్లికేషన్స్ అధినేత కిన్నెర రఘురామ్ ప్రచురించారని తెలిపారు.


మృతి చెందిన ఆవును పరిశీలిస్తున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాజు

ఆవును చంపేసిన పులి

దాడిచేసిన ప్రాంతంలో బోను ఏర్పాటు

ప్రజాశక్తి-బొండపల్లి


మండలంలో పులి సంచరిస్తూ పలు గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. రెండు నెలల వ్యవధిలో ఐదు గ్రామాల పరిధిలో ఐదు ఆవులపై దాడి చేసి చంపేసింది. తాజాగా మంగళవారం వేకువ జామున గరుడబిల్లిలో వెంపడాపు రామ్మూర్తికి చెందిన ఆవుపై దాడి చేసి చంపేసింది. ఆ ఆవు మరో నెల రోజుల్లో ప్రసవించాల్సి ఉంది. దీంతో గ్రామస్తుల్లో భయాందోళన నెలకొంది. వెంటనే అప్రమత్తమైన గ్రామ సర్పంచ్ బొద్దల కృష్ణవేణి గ్రామంలో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ కెవిఎన్ రాజు తన సిబ్బందితో వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపిడిఒ వేదవతి పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు.

హైస్కూలు విద్యార్థులకు రెండు రోజులు సెలవు

పులి దాడి చేసిన ప్రాంతం జెడ్‌పి ఉన్నత పాఠశాలకు ఆనుకొని ఉండడంతో విద్యార్థులకు ఎటువంటి ప్రమాదమూ లేకుండా ముందు జాగ్రత్త చర్యగా రెండు రోజులు పాటు అధికారులు సెలవు ప్రకటించారు. అటవీశాఖ అధికారుల సూచన మేరకు డిఇఒ సెలవు ప్రకటించారని డిప్యూటీ డిఇఒ కె.వాసుదేవరావు తెలిపారు.

బంగారు భవిష్యత్తుకు గ్రంథాలయాలు దోహదం

ప్రజాశక్తి-విజయనగరం కోట


పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న జెడ్‌పి సిఇఒ అశోక్‌కుమార్

యువత బంగారు భవిష్యత్తుకు గ్రంథాలయాలు ఎంతో తోడ్పడతాయని జిల్లా పరిషత్ సిఇఒ డాక్టర్ ఎం.అశోక్ కుమార్ అన్నారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా రెండో రోజు మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కూల్లో చేరిన నాటి నుంచి జీవితాంతం గ్రంథాలయాలతో అనుబంధం ముడిపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కె.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు మాదకద్రవ్యాలు వల్ల కలిగే దుష్పరిణా మాలపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు.

పెద్దలు చెప్పే నీతికథలు వినాలి

స్కూల్ విద్యార్థులు, చిన్న పిల్లలు ఇంట్లో ఉండే తాతయ్య, అమ్మమ్మ, నాన్నమ్మ చెప్పే నీతి కథలు విని వాటిని జీవితంలో వినియోగించుకోవాలని స్థానిక గాజులరేగ లైబ్రేరియన్ పిల్లలకు తెలిపారు. మంగళవారం స్థానిక లైబ్రరీలో లైబ్రేరియన్ ఆధ్వర్యంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవా లలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులతో కథలు చెప్పించడం, రాయించడం ఒటి కార్యక్రమాలు నిర్వహించారు. వారిలోని వారికే చిన్నచిన్న ఇంగ్లీష్ పదాలను కలిపి చదవడం నేర్పించారు.

సీతం కళాశాల లో బాలల దినోత్సవం

విజయ దుర్గా యువజన సంఘం' సీతం కళాశాలలో మేనేజ్‌మెంట్ స్టడీస్ డిపార్ట్‌మెంట్ కలిసి విద్యార్థుల కోసం క్రీడా పోటీలు నిర్వహించింది. ముఖ్య అతిథులు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, జిల్లా యువజన అధికారి జి.విక్రమ్ ఆదిత్య , విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఎల్తమాష్ హాజరయ్యారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు సలహాలు ఇచ్చారు. క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. శశిభూషణరావు, విజయ దుర్గ యువజన సంఘం అధ్యక్షురాలు కె.చంద్రిక, సీతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామ్మూర్తి, హెచ్ఒడి ఎస్. వరూధిని పాల్గొన్నారు.

18 నుంచి సిఎం కప్ ప్రైజ్ మనీ టోర్నమెంట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిఎం కప్ ప్రైజ్ మనీ టోర్నమెంట్ తేదీలను మంగళవారం సెట్విజ్ సిఇఒ బి.రామానందం, చీఫ్ కోచ్ అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ క్రీడంశాల్లో నియోజకవర్గ స్థాయి ఎంపికలు జరుగుతాయని తెలిపారు. 17న రాజాం జిసిఎస్‌అర్ కాలేజీలో, 19న నెల్లిమర్ల నియోజకవర్గం అలుగోలు జెడ్‌పి హైస్కూల్లో కబడ్డీ, 18న భోగాపురం హైస్కూల్‌లో వాలీబాల్, 20న బొబ్బిలి నియోజకవర్గం పక్కి జెడ్‌పి హైస్కూల్‌లో, 22న ఎస్.కోట నియోజకవర్గం కొత్తవలస ప్రగతి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ, 21న విజయనగరం నియోజకవర్గం స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయి ఎంపికలు, పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

18న జిల్లా స్థాయి సైన్సు కాంగ్రెస్ ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరం

జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్ సందర్భంగా ఈనెల 18న జిల్లా స్థాయి సైన్సు ప్రాజెక్టుల ప్రదర్శన విజయనగరంలో జరుగనుందని డిఇఒ వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లాలో గల అన్ని యాజమాన్యాల ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి మూడు లేదా ఐదు ప్రాజెక్టులు చొప్పున జిల్లా స్థాయి ప్రదర్శనలకు తీసుకురావాలని ఎంఇఒలకు, హెచ్‌ఎంలకు సూచించారు. ఒక ప్రాజెక్టుకు ఒక విద్యార్థి , ఒక ఉపాధ్యాయులను పంపించాలని తెలిపారు. వివరాలకు 9440963424 నెంబరును సంప్రదించాలని సూచంచారు.

సేవల మెరుగుదలకు ఫీడ్ బ్యాక్ మెకానిజం

వైద్యాధికారుల సమావేశంలో కలెక్టర్ సూర్యకుమారి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డిఎంహెచ్ఒ, డిసిహెచ్ఎస్

ప్రజాశక్తి-విజయనగరం

వైద్య రంగంలో సేవల మెరుగుదలకు ఫీడ్ బ్యాక్ మెకానిజం అత్యంత దోహదం చేస్తుందని కలెక్టర్ ఎ. సూర్యకుమారి పేర్కొన్నారు. మొక్కుబడిగా కాకుండా మనసు పెట్టి పని చేయాలని, ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలోని ఆసుపత్రుల నుంచి జిల్లా కేంద్ర ఆసుపత్రి వరకు సేవలను విస్తతం చేయాలని, పూర్తిస్థాయిలో మౌళిక వసతులను కల్పించాలని పేర్కొన్నారు. మంగళవారం తన ఛాంబర్లో వైద్యారోగ్య శాఖ పరిధిలోని వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. వైద్యరంగంలో అందుతున్న సేవలపై సమీక్షించారు. వైద్యపరమైన సేవలపై ప్రజల స్పందన ఎలా ఉందని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల అభిప్రాయాలను సేకరిస్తూ ఉత్తమ సేవలందించాలని, దానికి తగ్గట్లు ఫీడ్ బ్యాక్ మెకానిజం విధానాన్ని అందరూ అనుసరించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు ప్రయివేటు ఆసుపత్రులను కాకుండా ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించేలా నమ్మకాన్ని కలిగించాలన్నారు. ఇటీవల కాలంలో లెప్రసీ, హెచ్ఐవి. కేసులు పెరుగుతున్నాయని, వాటిపై దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా వైద్యపరమైన సేవలన్నీ కేంద్రీకతం అయితే బాగుంటుందని ఆమె అభిప్రాయ పడ్డారు. నెల్లిమర్ల, భోగాపురం, బొబ్బిలి కేంద్రాల్లో వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలని అన్నారు.

న్యుమోనియాపై గోడపత్రిక ఆవిష్కరణ

వారోత్సవాల్లో భాగంగా న్యుమోనియాపై అవగాహన కల్పిస్తూ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రచురించిన గోడపత్రికలను కలెక్టర్ సూర్యకుమారి తన ఛాంబర్లో ఆవిష్కరించారు. రక్తహీనత లేని ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత అటు ప్రజలపై, ఇటు అధికారులపై ఉందని అన్నారు. కార్యక్రమాల్లో డిఎం హెచ్ఒ డాక్టర్ ఎస్.వి. రమణ కుమారి, డిసిహెచ్ఎస్ డాక్టర్ నాగభూషణ్ రావు, డిఐఒ డాక్టర్ నారాయణ రావు, మలేరియా నివారణ అధికారి డాక్టర్ తులసి, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ సత్యప్రభాకర్, డిప్యూటీ డిఎంహెచ్ఒలు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పాత సామాగ్రికి 17న వేలం

బొబ్బిలి : స్థానిక గురుకుల పాఠశాలలో పాత సామాగ్రికి ఈనెల 17న వేలం వేయనున్నట్లు ప్రిన్సిపాల్ కె.రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. నిరుపయోగంగా ఉన్న వస్తువులు, పాత ఇనుము, పాడైపోయిన అల్యూమినియం పాత్రలు, విరిగిపోయిన కుర్చీలు, బెంచీలు, పాత పుస్తకాలకు వేలం వేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు పాఠశాలలో ఈనెల 17న ఉదయం 10గంటలకు జరగనున్న వేలం పాటకు హాజరు కావాలన్నారు.

ఎకరానికి 34 వరి బస్తాలు దిగుబడి

రేగిడి: ఈ ఖరీఫ్ వ్యవసాయానికి వరి పంటలు ఆశాజనకంగా ఉన్నాయని ఒక ఎకరానికి 34 వరి బస్తాలు దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ అధికారి గిరడ మురళీకృష్ణ, ఎఎస్ఒ ఏసుబాబు అన్నారు. మంగళవారం రేగిడి గ్రామంలో రైతు పొలాలలో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. పంటకోత ప్రయోగాల్లో 18,750 కేజీలు రావడంతో ఎకరానికి 34 వరి బస్తాలు వస్తున్నట్లు అంచనా వేశామన్నారు. 36 యూనిట్లో 144 పంట కోత ప్రయోగాలు లక్ష్యంగా తీసుకున్నామని చెప్పారు. ఈ పంట కోత ప్రయోగాల్లో ఉంగరాడ ఆర్‌బికె విఏఎ మహేష్, విఆర్‌ఒ నీలయ్య, అప్పలనాయుడు సిబ్బంది, రైతులు ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ

భోగాపురం : మండలంలోని ముంజేరు పంచాయతీ పిట్టపేట గ్రామంలో బైరెడ్డి ఆదెమ్మ, బైరెడ్డి లక్ష్మిల ఇళ్లు మూడురోజుల క్రితం అగ్ని ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ విషయం తెలుసుకుని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు తన వంతు సాయంగా ఒక్కొకరికి రూ.2వేలు నగదు, 50 బస్తాల సిమెంట్, 25 కేజీల బియ్యం, చీర, లుంగీ, తువాలు, దాప, 12 రకాల నిత్యావసర వస్తువులు, వంట పాత్రలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నీలపు అప్పలరామిరెడ్డి, ముంజేరు ఎంపిటిసి పిడుగు వెంకట సత్యం, పార్లమెంట్ మత్స్యకార సాధికార సమితి కన్వీనర్ మైలపల్లి ఎల్లాజి, టిడిపి సీనియర్ నాయకులు కోరాడ శ్రీరామ్, భోగాపురం మండల పార్టీ ఉపాధ్యక్షులు కోల రమేష్, పిడుగు నాగరాజు, మధు, సోమిరెడ్డి, కిలుము రామారావు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

రేగిడి: గ్రామ సచివాలయాల్లో ప్రతి ఉద్యోగి అందుబాటులో ఉండి, విధులు సక్రమంగా నిర్వహించి ప్రజలకు సేవలు అందించాలని ఎంపిడిఒ గన్నవరపు కాశీవిశ్వనాధరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం లింగాలవలస సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా శాఖల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి సచివాలయ ఉద్యోగులపై ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పనితనం మెరుగు పరుచుకోవాలన్నారు. గ్రామాల్లో సమస్యలు కొని తెచ్చుకోవద్దని తెలిపారు. పనిచేయని సచివాలయ ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయనతో పాటు సర్పంచ్ గురజాన అప్పలనాయుడు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించండి

శృంగవరపుకోట : బాల్య వివాహాలను నిర్మూలించాలని సామాజిక పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయాధికారి బి. రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ఎపి రెసిడెన్షియల్ (బాలికల) స్కూల్లో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షిత్‌తో, బాల్య వివాహ నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. రాష్ట్రంలో బాల్యంలోనే గర్భధారణ వల్ల 59 శాతం మంది మహిళలు కేవలం రక్తహీనతతో మరణిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ సౌజన్యలత, స్టాఫ్ నర్స్ తులసిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ సభ బహిష్కరణ

పూసపాటిరేగ : గతంలో పనిచేసిన పనులకు బిల్లులు మంజూరు చేయకుండా కొత్త పనులు ఎలాగంటూ ఉపాధి హామీ పథకం గ్రామ సభను సర్పంచ్ బొంపల సీతారాం, ఉప సర్పంచ్ మహంతి జనార్ధనరావు బహిష్కరించారు. మంగళవారం పూసపాటిరేగ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి వెంకటరావు అధ్యక్షతలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ 2023– 24కు సంబంధించి చేయాల్సిన పనులు గుర్తించి తీర్మానం కోసం గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎపిఒ కనకరాజు మాట్లాడుతుండగా పాత పనులకు బిల్లులు లేకుండా కొత్త పనులు తీర్మానం ఏంటని ప్రశ్నించారు. పాత బిల్లులకు సమాధానం చెప్పిన తరువాతే గ్రామ సభ జరుగుతొందని చెప్పడంతో ఎపిఒ, ఉపాధి సిబ్బంది వెనుతిరిగారు.

పనిచేయని తీర్మానాలెందుకు?

పూసపాటిరేగ : తాను సర్పంచ్ అయిన నుండి చేస్తున్న తీర్మానాలలో ఒక్క పనికూడా జరగలేదని, జరగని పనులకు తీర్మానాలు ఎందుకని సర్పంచ్ ఇజ్జురోతు అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఉపాధి హామీ పథకం గ్రామ సభ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 2023– 24 సంబంధించి గ్రామంలో చేయాల్సిన పనులపై ఫీల్డు అసిస్టెంట్ చదివి వినిపించారు. సర్పంచ్ స్పందించి తాను సర్పంచ్‌గా వచ్చిన దగ్గర నుండి 8 సార్లు గ్రామ సభ జరిగిందని ఇందులో ఒక్క పనికూడా జరగలేదని అసహనం వ్యక్తం చేశారు.

ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం కొంటుంది

మెరక ముడిదాం : రైతు పండించే ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సోమలింగాపురం గ్రామంలో మంగళవారం ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రభుత్వం రైతు పక్షపాతి అని దళారులను నమ్మి రైతులు మోస పోవద్దు అని తెలిపారు. రైతులు నుండి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన 21రోజులలో రైతులు ఖాతాలో నగదు జమ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్‌వి రమణ రాజు, తాడ్డి వేణుగోపాలరావు, సీతారామ రాజు, కర్రోతు నాగేశ్వరరావు, కుప్పరపాటి శివరామ కృష్ణ ప్రసాద్, హరిబాబు పాల్గొన్నారు.

భూ ఆక్రమాలపై చర్యలు తీసుకోవాలి

బొబ్బిలి: రామభద్రపురం మండల కేంద్రంలో భూ ఆక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి కోరారు. భూ ఆక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఆర్డిఒ పి.శేషశైలజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబు పాలూరి మాట్లాడుతూ రామభద్రపురం మండల కేంద్రంలో ప్రభుత్వానికి చెందిన భూమిని అధికార పార్టీకి చెందిన నాయకులు రికార్డులను తారుమారు చేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మహంతి ధనుంజయరావు, ఎస్.గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన శిక్షణ ఇస్తాం

గజపతినగరం : నాణ్యమైన శిక్షణ ఇస్తాం సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని మాజీ ఎమ్మెల్యే కె.ఎ నాయుడు అన్నారు. ఎయిమ్ స్టడీ సర్కిల్ ఉచిత శిక్షణ కోసం నమోదు చేసుకున్న 50 మంది అభ్యర్థులకు ఆయన ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. వీరికి కావలసిన శిక్షణ, మెటీరియల్ ఖర్చును తను సంస్థకు చెల్లిస్తానని అన్నారు. ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిరుద్యోగుల కోసం నిరుద్యోగ భృతి ఇచ్చేవాళ్లమన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగ ప్రకటనలే లేకపోవడం, పరీక్షల వాయిదాతో నిరుద్యోగులు అనేకరకాలుగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అందుకే నిరుద్యోగులకు అండగా ఉంటామని గతంలో ఎన్‌ఎస్‌పిఐని శిక్షణ ఏర్పాటు చేశామని, ఇప్పుడు అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మంచి అధ్యాపకులతో శిక్షణ ఇప్పించడం జరుగుతున్నదని అన్నారు.

పుట్టగొడుగులు యూనిట్ స్థాపించాలి

బాడంగి : మహిళలందరూ పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ అనంతరం యూనిట్లు స్థాపించాలని ఆర్డిఒ డిడి జమదగ్ని అన్నారు. మంగళవారం స్థానిక ఎత్తిరాజ సమీపన గల దీక్ష మహిళా వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో నాబార్డ్ సహకారంతో పుట్టగొడుగుల పెంపకంపై ఇస్తున్న శిక్షణలో ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. దీక్ష మహిళ వెల్ఫేర్ సొసైటీ ఇస్తున్న ఇలాంటి శిక్షణలు వల్ల మహిళలు ఆర్థికంగా మెరుగుపడేందుకు చాలా ఉపయోగాలున్న వీటిని మహిళలు ఉపయోగించుకొని వారి కుటుంబానికి సహాయపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దీక్ష మహిళా వెల్ఫేర్ సొసైటీ సిఇఒ శాంతి, సింజంట ఫౌండేషన్ ప్రతినిధి లంక సైదిరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ మృతి

లక్కవరపుకోట : మండల కేంద్రంలో గల గృహ నిర్మాణ శాఖ కార్యాలయం ఎదురుగా మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ మృతి చెందాడు. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం అనకపల్లి గ్రామానికి చెందిన కర్రి అప్పారావు (63) మండలంలోని కాసాపేట గ్రామంలో ఉన్న తన కుమార్తె పార్వతి ఇంటికి వచ్చి ద్విచక్ర వాహనంపై తిరిగి వెళుతుండగా రోడ్డుపై పడి మృతి చెందాడు. మృతుడు తనంతట తాను పడ్డాడా? మరేదైనా వాహనం ఢీకొందా? అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ ఐ ముకుందరావు తెలిపారు. మృత దేహానికి పంచనామా జరిపి పోస్టుమార్టం నిమిత్తం ఎస్‌కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

స్థానికులకు ఉపాధి కల్పించాల్సిందే

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పరిశ్రమల్లో స్థానికలుకు ఉపాది కల్పించకపోతే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని, కచ్చితంగా ఉపాధి కల్పించాల్సిందేనని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం మండలంలోని కొప్పెర్ల గురుకులంలో మైలాన్ పరిశ్రమ యాజమాన్యం సిఎస్ఆర్ యాక్టివిటీస్‌లో బాగంగా రూ. 1.50 కోట్లుతో డార్మిటరీ నిర్మాణానికి భూమి పూజ జరిగింది. ఈ సందర్భంగా మైలాన్ పరిశ్రమ ప్రతినిధి మల్లికార్జున్ నాగినేని మాట్లాడుతూ తమ పరిశ్రమ ద్వారా సామాజిక భాద్యతగా విధ్య, వైద్యం, తాగునీరుతో పాటు చెరువులు అభివృద్ధి చేస్తున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ గురుకులం విద్యార్ధుల కోసం డార్మెటరీ నిర్మాణం చేయాలని మూడు సంవత్సరాలుగా అడుగుతుంటే ఇప్పటికి స్పందించి నందుకు సంతోషంగా ఉందన్నారు. మీ పరిశ్రమ గురించి మల్లికార్జున్ చెప్పినవి మాకు ఎక్కడా కన్పించలేదన్నారు. మీ పరిశ్రమ నుండి పూసపాటిరేగ పిహెచ్‌సిలో ఒక బిల్డింగ్ మాత్రమే నిర్మాణం చేసినట్లు తనకు తెలుసన్నారు. పరిశ్రమ ప్రతినిధులు ఎమ్మెల్యే ఫోన్ చేసినా స్పందించరని 'మా రోడ్లు, మా నీరు వాడుకొని, మా ప్రాంతాన్ని కాలుష్యం చేస్తూ ఉద్యోగాలు ఇతర ప్రాంతాలు వారికి మీరు ఎలా ఇస్తారని' అసహనం వ్యక్తం చేసారు. ఇక్కడ ప్రజా ప్రతినిదులంటే మీకు లెక్కలేదన్నారు. తమ ప్రజా ప్రతినిధులకు కాంట్రాక్ట్ ఇవ్వమని అడిగితే లేదంటారని తమపై ఓడిపోయిన వారిని కాంట్రాక్టర్‌లుగా ప్రోత్సహిస్తున్నారని సమన్యాయం చేయాల్సిన యాజమాన్యం తప్పించుకుంటుదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు చాలా ఆగ్రహంగా ఉన్నారని, ఒక్కసారి చేయిదాటిపోతే అదుపుచేయడం తన వల్ల కాదని అన్నారు. స్నేహపూర్వక ఉద్యోగాలివ్వాలని లేకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం డైరెక్టర్‌లు మిచల్ డామెనికా, ప్లాంట్ హెడ్ అంజనీకుమార్, ఎంపిపి మహంతి కళ్యాణి, సర్పంచి పైడి వెంకటరమణ, నాయకులు మహంతి జనార్ధనరావు, పుప్పాల లక్ష్మినారాయణ, గురుకులం సమన్వయకర్త చంద్రావతి, ఉపాద్యాయులు, విద్యార్ధులు, నాయకులు పాల్గొన్నారు.

మైలాన్ ప్రతినిధిలకు ఎమ్మెల్యే బడ్డుకొండ హెచ్చరిక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

మహాసభల విజయంతానికి ఎస్‌ఎఫ్‌ఐ ప్రచారం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

డిసెంబర్ 3,4 తేదీల్లో జరగబోయే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల వాల్ పోస్టర్‌ను ఎస్‌కోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం కళాశాలలో ఆవిష్కరించారు. విజయనగరం జిల్లా ఎస్ఎఫ్ఐ 30వ జిల్లా మహాసభలు డిసెంబర్ 3,4 తేదీల్లో బొబ్బిలిలో జరగనున్నాయని వాటిని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నిరంతరం విద్యా రంగంలో వస్తున్న మార్పులు, అవి పేద, సామాన్య విద్యార్థులకు ఏ విధంగా ఉపయోగం అనేది ఆలోచించి వాటి వల్ల వచ్చే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు రామునాయుడు,జయ తదితరులు పాల్గొన్నారు

గజపతినగరం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఆవరణంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి రాము మాట్లాడుతూ డిసెంబర్ 3,4 తేదీలలో బొబ్బిలి పట్టణ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు జరుగుతాయని అందరూ హాజరు కవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నేతేటి తాతినాయుడు, జిల్లా కమిటి సభ్యులు లక్ష్మణ రావు, మండల అధ్యక్షుడు సాయి, పి. లక్ష్మణ్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ఎస్ఎఫ్ఐ 30వ జిల్లా మహాసభలు డిసెంబర్ 3,4 తేదీల్లో బొబ్బిలిలో జరగనున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు అరవింద్ తెలిపారు. మంగళవారం నెల్లిమర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సభలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బొబ్బిలి: జిల్లా ఎస్ఎఫ్ఐ 30వ జిల్లా మహాసభలు డిసెంబర్ 3,4 తేదీల్లో బొబ్బిలి పట్టణంలో గంటి ప్రసాదం భవనంలో జరగనున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి. రామ్మోహన్ తెలిపారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా మహాసభలు గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నిరంతరం విద్యా రంగ సమస్యలపై పోరాడుతుందన్నారు. సభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ బొబ్బిలి మండల నాయకులు శ్రీను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలోని తహశీల్దార్ 1 భాస్కరరావు చేతులు మీదుగా ఎస్ఎఫ్ఐ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్ పావని మాట్లాడుతూ డిసెంబరు 3,4 తేదీల్లో బొబ్బిలిలో జరగనున్న సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్. రవికుమార్ పాల్గొన్నారు.



బొబ్బిలి: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ పరిశీలన

వేపాడ : మండలంలోని సోంపురం గ్రామ సచివాలయ పరిధిలో గల చెత్త నుండి సంపద తయారు చేసే షెడ్‌ను ఎంపిడిఒ బిఎస్ఎన్‌కె పట్నాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలందరూ ఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌లను వినియోగించుకునే విధంగా చైతన్య వంతులను చేయాలని పంచాయతీ కార్యదర్శి బి నాగమణికి సూచించారు.

రామాలయంలో ఎమ్మెల్సీ పూజలు

వేపాడ : మండలం బొద్దాం రామాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో సోమవారం రాత్రి స్థానిక ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమం గురు స్వామి డి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రాలు పరిశీలన

వేపాడ : మండలంలోని పాటూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపిపి దొగ్గ సత్యవంతుడు మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఇస్తున్న మెనూ, రికార్డులు పరిశీలించారు. ఇందులో భాగంగా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న యండియం సక్రమంగా అందుతుందా లేదా అని అడిగారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని పరిశీలించి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రజా సేవే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ప్రజలకు కార్యాలయంలో అందుబాటులో ఉండి సేవలు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సంధ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

రేగిడి : సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కొమిరి, అంబఖండి గ్రామాల్లో లోన్‌యాప్ వేధింపులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇటీవల లోన్ యాప్ వేధింపులకు చాలామంది ప్రాణాలు బలి తీసుకుంటున్నారని వివరించారు. సైబర్ నేరగాళ్లపై ఫోన్ వేధింపులు చేస్తే తక్షణమే పోలీస్ స్టేషన్‌కి ఫిర్యాదు చేయాలన్నారు. విలువైన ప్రాణాలు పోగొట్టుకోవద్దని తెలిపారు. సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్లు వస్తే ఒటిపి చెప్పవద్దని తెలిపారు. ఎటువంటి బ్యాంకు ఖాతా నెంబరు, ఆధారు, ఇతర వివరాలివ్వాలన్నారు.

నాలుగేళ్లుగా అన్నసమారాధన

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని కొట్యాడలో ఉన్న అభయాంజనేయ ఆలయంలో గడిచిన నాలుగేళ్లుగా అయ్యప్ప, భవానీ మాలాధారణ భక్తులకు అదే గ్రామానికి చెందిన కిట్ట గోవిందరావు, అచ్చియమ్మ దంపతులు కార్తీక మాసమంతా నిత్య అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ అన్నసమారాధనకు ప్రతిరోజు వందల సంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా గురుస్వామి గోవిందరావు మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు తనకున్నంతలో సాయంగా ప్రతి ఏటా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కొట్యాడ గ్రామ పంచాయతీలో అయ్యప్ప భక్తులకు సన్నిధానం (పీఠం) లేనందున దాని నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. విరాళాలు సేకరించి పీఠం నిర్మాణానికి కొంత స్థలం కొనుగోలు చేసినట్లు తెలిపారు. భక్తుల సహకారంతో భవన నిర్మాణం పనులు ప్రారంభించినట్లు చెప్పారు. పీఠం నిర్మాణానికి విరాళాల రూపంలో దాతలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సేవా కార్యక్రమంలో తన కుమార్తె రేవతి, కుమారుడు షణ్ముఖేశ్వర్ భాగస్వాములవ్వడం ఆనందదాయకంగా ఉందని చెప్పారు.


స్వాములకు అన్నదానం చేస్తున్న నిర్వాహుకులు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటేనే భవిష్యత్తు

బొబ్బిలి : మాదకద్రవ్యాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ అన్నారు. గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా మంగళ వారం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు లోనైతే భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. గ్రంధాలయాలతో విజ్ఞానాన్ని పెంచుకో వచ్చు నన్నారు. గ్రంధాల యాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంధాలయ అధికారి స్వర్ణకుమారి, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

బాడంగి : 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బాడంగి శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఆర్. దుర్గా ప్రసాద్ అధ్వర్యంలో ఎస్ఐ కొండలరావు మాదక ద్రవ్యాల పై విద్యార్థిని, విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందన్నారు. అనంతరం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు.

వేపాడ : మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో మంగళవారం 700 పుస్తకాలను ప్రదర్శనగా పెట్టారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితునిగా వల్లంపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ అర్జున్‌రావు పాల్గొన్నారు. శాఖ గ్రంథాలయ లైబ్రేరియన్ ఎస్ స్వామి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యువత పాల్గొన్నారు.


బొబ్బిలి: పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న సిఐ జైభీమ్

శివాలయానికి నాగభరణం సమర్పణ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బాణాది శివాలయానికి సబ్బవరం ఎంపిపి బోకం రామునాయుడు, సూర్యకుమారి దంపతులు వెండితో తయారు చేసిన ఒకటిన్నర కిలోల నాగభరణం బహుకరించారు. ముందుగా ఈ నాగభరణాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం శివాలయ అర్చకులు కిషోర్ శర్మ శాస్త్రంగా పూజలు నిర్వహించి నాగ భరణాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు గొంప వెంకటరావు, వైసిపి నాయకులు గళ్ళ రామచంద్రుడు ఆర్థిక సహాయంతో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాణాది ఎంపిటిసి గొంప తులసి, గ్రామ సర్పంచ్ కర్రీ యశోద, పలువురు గ్రామ పెద్దలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.


నాగభరణాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న ఎంపిపి దంపతులు

పేదలందరికీ ఇళ్లు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బొబ్బిలి రూరల్

అర్హులైన పేదలందరికీ ఇల్లు ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రభుత్వం రాష్ట్రంలో 30లక్షల పైచిలుకు ఇళ్ళు మంజూరు చేసిందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. మంగళవారం మండలంలో గోపాలరాయుడు పేట పంచాయతీ పరిధిలో గల బట్టివలస, కొత్తబట్టివలస, అక్కేనవలస, గిరిజన గ్రామలకు చెందిన 26మంది లబ్దిదారులకు ఆయన చేతులమీదుగా ఇళ్ళ పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం వైస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా గ్రామంలో పలువురుకు ఆయన కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా అక్కడి గిరిజన ప్రజలతో మమేకం అయ్యి గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

అక్కడి స్థానికులు సి.సి.రోడ్లు, తాగునీరు, కరెంట్ సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే శంబంగి దృష్టికి తీసుకువచ్చారు. దానికి ఆయన స్పందిస్తూ సంబంధిత అధికారులుతో మాట్లాడి ఆయా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజారావు, ఎంపిడిఒ అల్లు భాస్కరరావు, మాజీ సర్పంచ్ అక్కేన గౌరమ్మ, వంగపండు వెంకట రమణ, హౌసింగ్ డి.ఈ. అప్పయ్య, వైసిపి నాయకులు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పాల్గొన్నారు.

సర్వీస్ రూల్స్ డిఇఒలే చూడాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ జిల్లా విద్య శాఖ చూడాలని ఎపిటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు బంకురు జోగినాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయుల, బోధనేతర సిబ్బంది సర్వీస్‌కు సంబంధించిన విషయాలు, మెడికల్ మంజూరు తదితర అధికారాలను మున్సిపల్ కమిషనర్ల నుండి జిల్లా విద్య శాఖ అధికారులకు భాదలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన తెలిపారు. కానీ నేటివరకు ఆ ఉత్తర్వులను అమలు చేయకుండా తాత్సారం చేస్తూ జిల్లా విద్యా శాఖ నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన అన్నారు. కావున వెంటనే ఆ ఉత్తర్వులు అమలు చేసి వెంటనే కమిషనర్ల దగ్గరవున్న ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్లలను ఎంఇఒ, ఉప విద్య శాఖ అధికారులు స్వాధీనం చేసుకొనే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయనతో పాటు జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎన్. ధనలక్ష్మి పాల్గొన్నారు.

'లెండి'లో సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీపై రెండు రోజుల పాటు జరగనున్న వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. శాప్ ల్యాబ్స్ నుండి అప్లికేషన్ సెక్యూరిటీ లీడ్ అండ్ సీనియర్ డైరెక్టర్ శైలజా వడ్లమూడి హాజరై మాట్లాడారు. ప్రస్తుతం సోషల్ ఇంజినీరింగ్ దాడులు ఏవిధంగా జరుగుతున్నాయో, సమాజంలోని ప్రస్తుత పరిస్థితులను ఎలా కాపాడుకోవాలో వివరించారు. వ్యక్తిగత డేటా, తదుపరి ప్రమాదాలను క్యాప్చర్ చేయగల ఆన్‌లైన్ గేమ్‌ల కోసం ఒటిపి, లేదా లింక్‌లను షేర్ చేయవద్దని చెప్పారు. మరో ట్రైనర్ ఇండియన్ సర్వర్స్ ప్రెసిడెంట్ సాయి సతీష్ మాట్లాడుతూ భద్రతపై వివిధ అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. సైబర్ సెక్యూరిటీ, గోప్యతలో ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థినులకు విమెన్ ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ప్రైవసీ ఉద్యమంలో భాగంగా ఇంటర్న్‌షిప్‌ను అందజేస్తామని చెప్పారు. ప్రిన్సిపాల్ రామారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు కెరీర్ వైపు సాంకేతికంగా ఎదగాలని, సైబర్ దాడులను అరికట్టడం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు తమ్మినేని, డీన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ జి ప్రకాష్ పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- డెంకాడ

అర్హులందరికీ సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని అక్కివరం సచివాలయం పరిధిలోని మాన్యం కల్లాలు, యాత పేట గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి ఆ కుటుంబం పొందిన పథకాల జాబితాను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపిపి తమ్మినాయుడు, ఏఎంసి వైస్ చైర్మన్ చింతపల్లి రామూర్తి, రాష్ట్ర డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బిర్సా ముండా జయంతి

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివాసి స్వతంత్ర సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా 148వ జయంతిని జన జాతీయ గౌరవ దివస్‌లో భాగంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు మాట్లాడుతూ భారత ఆదివాసుల పోరాటాలు స్వతంత్ర సమరానికి పునాదులు వేసి బిర్సాముండా బ్రిటిష్ పరాయి పాలకులపై చేసిన పోరాటం భారత చరిత్రలో మరువలేనిదన్నారు. భారత స్వతంత్ర సంగ్రామంలో శతాబ్దాలుగా ఎందరో మహనీయులు త్యాగాలతో జరిపిన పోరాటాలు వెలుగులోకి రాలేదని అలాంటి పోరాటాల్లో బిర్సాముండా పోరాటం ఒకటని కొనియాడారు.

వివాదంపై విచారణ

బాడంగి : మండలంలోని వీర సాగరంలోని చేపల చెరువుల లీజు వ్యవహారం వివాదాలకు దారితీసిన నేపథ్యంలో డిఎల్‌పిఒ బి. మోహనరావు మంగళవారం విచారణ చేశారు. గ్రామంలో పెద్దలు, అధికారుల సమక్షంలో ఇరువర్గాల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అంతా సమన్వయంతో కొలిక్కి రావాలని లేకుంటే తమ పని తాము చేసుకుపోతామని హెచ్చరించారు. ఇరు వర్గాలు పది రోజులు గడువు కోరగా ఆయన అంగీకరించారు. ఈ విచారణలో ఇఒపిఆర్‌డి, మత్స్యకార సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోపాలం, బి.రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని మంగళవారం పిరిడి గ్రామంలో పర్యటించి మాట్లాడారు. బొబ్బిలి ప్రాంతంలో 60శాతం వరి కోతలు పూర్తి చేసినప్పటికి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో పొలాల్లోనే వరి కుప్పలు వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఆచరణలో ప్రారంభించడం లేదన్నారు. రైతు భరోసా కేంద్రాలకు ఎటువంటి మెటీరియల్ సరఫరా చేయలేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారీలను ఆశ్రయించి నష్టపోతున్నారన్నారు. తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎం.పరశురాం, వి.చిన్నారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ హెడ్ ట్యాంక్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన

కొత్తవలస : జల్ జీవన్ మిషన్‌లో భాగంగా గొల్లల పాలెం గ్రామంలో రూ.19 లక్షల అంచనా వ్యయంతో 30 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా గొల్లలపాలెం నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, ఏఎంసి వైస్ చైర్మన్ బొంతల వెంకటరావు, నీలాద్రి రమణ, బాలామణి, కోర్రాయి రాము నాయుడు, పైడిరాజు, పంచదారల శ్రీను, మండల యువజన విభాగ అధ్యక్షుడు ఐతంశెట్టి అనిల్, జామి సాల్మన్ రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పైడిరాజు, ఏ.ఇ. సన్యాసిరావు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- పూసపాటిరేగ

మండలంలోని పేరాపురం జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంపడాం గ్రామానికి చెందిన లెంక పైడన్న (65) అక్కడ కక్కడే మృతి చెందాడు. పేరాపురం జంక్షన్‌లో రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం నుండి వస్తున్న కారు డీ కొట్టింది. దాంతో పైడన్న అక్కడకక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పూసపాటిరేగ ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.